ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

❖ 10 హెచ్‌పీ మోటర్లను అంగీకరించం

సీసీసీ నస్పూర్, నవంబర్ 21 : నేను 12 ఏండ్లుగా వ్యవసాయం చేస్తున్న. తెలంగాణ రాకముందు వ్యవసాయమంటేనే భయమయ్యేది. కరెంట్ సక్కగా ఉండేటిది కాదు. పొలానికి సరిగా నీరు అందకపోయేది. ఎరువుల కోసం ఇబ్బందిపడ్డాం. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ సారు ఎప్పుడైతే 24 గంటలు కరెంటు తీసుకచ్చిండో అప్పటి నుంచి మాకు రంది లేకుంటైంది. మాకు వీలైనప్పుడు పోయి పొలానికి నీళ్లు పెట్టుకుంటున్నం. కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంట్ సరిపోతుందని అంటున్నరు. తెల్వక మాట్లాడుతున్నరు. ఆ నిర్ణయం సరైనది కానే కాదు. కాంగ్రెసోళ్లకు రైతుల బాధలు ఏం తెలుసు. పొలానికి నీరు పెట్టడానికి 3 హెచ్‌పీ మోటర్లు వాడుతున్నం. 10 హెచ్‌పీ మోటర్ పెట్టుడు సాధ్యం కాదు. కాంగ్రెస్ విధానాలను మేము వ్యతిరేకిస్తున్నం. 3 గంటల కరెంటు, 10హెచ్‌పీ మోటర్లను మేము అంగీకరించం.

- బొల్లం తిరుపతి, సీతారాంపల్లి

❖ రైతుల కష్టాలు కాంగ్రెసోళ్లకు తెలియవు

కాసిపేట, నవంబర్ 21 : రైతుల కష్టాలు కాంగ్రెస్‌కు తెలియవు. మూడు గంటల కరెంట్‌తో పొలాలెట్ల పండుతయి. తెలంగాణ సర్కారు ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో రంది లేకుంట పంట లేసుకుంటున్నం. కావాల్సినప్పుడు పోయి నీళ్లు పెట్టుకుంటున్నం. కాంగ్రెసోళ్లు వస్తే మూడు గంటల కరెంటిస్తమంటున్నరు. గా కరెంట్‌తో అరెకరం కూడా పారదు. పైగా తెలిసీ తెలియక మాట్లాడుతున్నరు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటున్నరు.గీ మోటర్లు పెట్టుకుంటే బాయిళ్ల నీళ్లుండద్దా. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు ఉంటయా.. మొత్తం కాలీ బూడిదైతయి. కాంగ్రెసోళ్ల మాటలు పట్టుకుంటే అంతే సంగతి.

- లవుడం మైసన్న, రైతు

❖ ఆ రోజు గుర్తుకు వస్తే దుఃఖం ఆగది కొడుకా..

లక్షెట్టిపేట, నవంబర్ 21 కాంగ్రెసోళ్లు పాలించినప్పుడు రైతుల గోస గుర్తుకు వత్తే దుఃఖం ఆగది కొడుకా. కరెంటు కోసం రాత్రి పూట పెండ్లాం. పిల్లగాండ్లను ఇంట్ల ఇడిసిపెట్టి బుక్కెడు బువ్వ తిని పొలంకాడికి పోయి కరెంటు కోసం ఎదిరిచూసేటోళ్లం. చుక్క తెగి పడ్డట్టు ఎప్పుడో అర్ధరాత్రి కరెంటు ఇచ్చేటోళ్లు. అది కూడా ఎప్పుడు పోతుందో తెలువకపోతుండే కరెంటు రాగానే మోటరు వేసి చూసుకుంట ఉండేటోళ్లం. ఆ రాత్రి చీకట్ల కరెంటు ఉండక పోవడంతో ఏ పురుగు బూషి వచ్చి కుడుతదో కూడా తెలువకపోతుండే. కొన్ని ఊళ్లలో కరెంటు రాంగనే రైతులు మోటర్ల వేయడానికి పోయి నాణ్యత లేని వైర్లు వాడడంతో మోటరు వేయంగా కరెంటు షాక్ కొట్టి కూడా చనిపోయిండ్రు. వ్యవసాయమంటేనే మాకు భయం వేస్తుండే. తెలంగాణ ప్రభుత్వం వచ్చినంక సీఎం కేసీఆర్ సారు మాకు 24 గంటల కరెంటు ఇత్తుండు. మేం ఎప్పుడు పడితే అప్పుడు పొలం కాడికి పోయి నీళ్లు పెట్టుకుంటున్నం. మళ్లీ కాంగ్రెస్ పార్టీ వాళ్లు వస్తే మాకు మూడు గంటల కరెంటు ఇత్తరట. 10 హెచ్‌పీ మోటర్ కొనాల్నట.. మాకు కొనుక్కునే స్థోమత మాకు లేదు. ఆ మోటర్ పెట్టుకునే అంత పెద్ద బాయి కూడా మాకు లేదు. **- అత్తె సుధాకర్, జెండా వెంకటాపూర్ గ్రామం, లక్షెట్టిపేట మండలం**

❖ దొంగ రిజిస్ట్రేషన్లు బంద్జైనయ్..

లక్షెట్టిపేట, నవంబర్ 21: గత ప్రభుత్వాలు ఉన్న సమయంలో నాయకులు దొంగ రిజిస్ట్రేషన్లు చేసుకుని భూము లు గుంజుకునేటోళ్లు, అదే తెలంగాణ ప్రభుత్వం వచ్చినంక నకిలీ రిజిస్ట్రేషన్లు బంద్ అయినయి. ఇప్పుడు నకిలీది కానీ దొంగది కానీ ఏదీ కాకుండా చేసింది. అప్పట్లో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ఉన్నప్పుడు మా భూమి పని ఏది కావాలన్న తహసీల్దార్ ఆఫీస్ చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగేటోళ్లం. అయిన కూ డా మా పనులు కాక పోయేటివి. ఇప్పుడు ఆ పరిస్థితి అనేది లే కుండా పోయింది. ముఖ్యంగా కాంగ్రెస్ దొంగల పాలన ఉండం గా రైతులు పడ్డ కష్టం చెప్పుకుంటే దుఃఖ అత్తది. ఆ నా కొడుకులు రైతులను కష్ట పెట్టినందుకే పాపం తగిలి మన తెలంగాణల పదేండ్లు కనపడ కుండా పోయిండ్రు. పాపం చేస్తే దేవుడు చూస్తాడు అని అట్టిగ నే అనరు. మళ్లీ అది చేస్తం ఇది చేస్తం అని ఎలక్షన్‌లు రాంగనే వచ్చి ఏదో మాట్లాడు తుండ్రు. వాళ్లకు రైతులు ఓటుతో బుద్ధి చెప్పి మళ్లీ వచ్చిన కాడికి పంపుడు ఖాయం. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రైతులకు చేసిందేమీ లేదు. **-సంగ మనోహర్, పాతకొమ్ముగూడెం, లక్షెట్టిపేట మండలం**

❖ ధరణితో రైతులకు మేలు

దండేపల్లి, నవంబర్ 21 : ధరణితో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. గతంలో ఉన్న పట్వారీ వ్యవస్థతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డరు. తెలంగాణ రాకముందు కౌలుదారు, పట్టాదారు కాలమ్ పెట్టి భూములన్న రైతులను ఎన్నో ఇబ్బందులు పెట్టారు. ధరణి తీసేసి భూమాత పెట్టాలని చూస్తున్నరు. ధరణి రైతులకు మంచిగుంది. ధరణి పోర్టల్ వల్ల పైరవీలకు వీలు లేకుండా పోయింది. ఈ సిస్టం వల్ల పనులు తొందరగా అవుతున్నయి. కేసీఆర్ వచ్చినంక భూములకు భద్రత కల్పించారు. పట్టాదారు అనుమతి లేనిదే భూమి మార్పిడి చేసే అధికారం లేకుండా చేసిన్రు. పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తే రైతులు అరిగోస పడటం ఖాయం.

-మడిపెల్లి అంజన్న, గుడిరేవు.

❖ కాంగ్రెస్‌ను నమ్మితే పాత కథే..

దండేపల్లి, నవంబర్21 : నాకు మా ఊరి శివారులో పదెకరాల పొలం ఉంది. ధరణిపై కాంగ్రెస్ మాటలను నమ్మితే మళ్లీ పాత రోజులే వస్తయ్. పట్వారీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తుంది. రైతులను ఇబ్బంది పెట్టే కాంగ్రెస్‌ను ప్రజలు విశ్వసించవద్దు. తెలంగాణ రాకముందు ఉన్న పట్వారీ వ్యవస్థ వల్ల అప్పట్లో మేము చాలా ఇబ్బంది పడ్డం. పహాణీ కావాలంటే కూడా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరిగేవాళ్లం. పట్వారీ ఉన్నప్పుడు పంట నష్టం జరిగినా, బ్యాంక్ లోన్ కోసం భూమి రికార్డులకు ఎక్కియాలన్నా ఖర్చు అవుతుండే. భూమి కొని పట్టా చేసుకున్న తర్వాత దానిని రికార్డుల్లోకి ఎక్కించి మ్యుటేషన్ చేయించాలన్నా..పట్టా పాసుబుక్కు తీసుకోవాలన్నా తిరగాల్సిందే. తెలంగాణ సర్కారు వచ్చినంక కేసీఆర్ సార్ ధరణితో ఒక్క దగ్గరే రిజిస్ట్రేషన్ మ్యుటేషన్ చేసి అప్పటికప్పుడు పాసుబుక్కు ఇస్తున్నారు. అరిగోసపెట్టిన కాంగ్రెస్‌ను దగ్గరికి రానియ్యం. **- ఉస్మాన్‌ఖాన్, తాళ్లపేట-దండేపల్లి**

❖ రైతుల కష్టాలు కాంగ్రెసోళ్లకు తెలియవు

వేమనపల్లి, నవంబర్ 21 : బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎవుసానికి 24 గంటల కరెంటివ్వడంతో రంది లేకుంట ఎవుసం చేసుకుంటున్నం. అదే కాంగ్రెసోళ్లు చెప్పినట్లు మూడు గంటల కరెంటే ఇస్తే ఎవుసం మూలకు పడడం ఖాయం. ఇంకా 10 హెచ్‌పీ మోటార్లు పెట్టుకోమని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెబుతున్నడు. అసలు తెలివి ఉండే మాట్లాడుతున్నడా..? 10 హెచ్‌పీ మోటర్లు కొనాలంటే రైతులకు ఎంత ఆర్థిక భారం పడుతుంది. బోరు బావికి 10 హెచ్‌పీ మోటరు అమర్చితే ఊట అందక కరెంట్ పోయదు. ఏండ్లకేండ్ల సంది రైతులు 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లనే వాడుతున్నరు. 24 గంటల పాటు బోరు నడిచినా నీరు ఇంకిపోదు. ఎన్ని ఎకరాలు అయినా పారిచ్చుకోవచ్చు. సీఎం కేసీఆర్‌తోనే రైతులు, ప్రజలు అభివృద్ధి చెందుతారు. మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావాలి.

- బత్తుల రాజన్న, మిర్చిరైతు, లక్ష్మీపూర్

❖ దళారుల ప్రమేయం పెరుగుతుంది..

చెన్నూర్ రూరల్, నవంబర్ 21: కాంగ్రెస్ వస్తే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామంటున్నరు. ఇంతకంటే దౌర్భాగ్యముండదు. గతంలో రైతులు అష్టకష్టాలు పడ్డరు. కాంగ్రెస్ తెచ్చే భూమాత పోర్టల్‌తో కొట్లాటలు అయితయి. దళారుల ప్రమేయం పెరుగుతుంది. లంచాలు పెరిగిపోతయి. ధరణి పోర్టల్‌తోనే రైతుల భూములకు రక్షణ ఉంటుంది. మరో పక్క కౌలుదారులు, అనుభవదారుల కాలం అంటూ కొత్త గైడ్‌లైన్స్ తెస్తరట. వాళ్ల పిచ్చి నిర్ణయాలతో రైతులు నష్టపోయే పరిస్థితి వచ్చేటట్లు ఉంది. అవగాహన లేని కాంగ్రెసోళ్లకు తగిన గుణపాఠం చెప్పాల్సిందే.

- ముత్యాల తిరుపతి గౌడ్, రైతు, కొమ్మెర

10 హెచ్‌పీ.. తడికి మోపెడు..

పెద్ద మోటరుతో రైతులను ఆర్థికంగా దెబ్బ తీసేందుకు కాంగ్రెస్ కుట్ర

- అన్నదాతలపై పంపు సెట్లు, పైపులు, వైర్లు, స్టార్టర్లు, మెకానిక్‌లు, కూలీల భారం
- ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు భారం పడి కాలిపోయే అవకాశం
- మూడు గంటల కరెంటుతోనే బతుకులు బాగుపడ్డాయంటున్న రైతులు

మంచిర్యాల, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు సరఫరా చేస్తుండడంతో రైతులు రెండు పంటలు వేస్తున్నారు. అవసరాన్ని బట్టి 3, 5 హెచ్‌పీ మోటర్లను వినియోగిస్తున్నారు. యాసంగి, వానకాలంలో పంటలు వేస్తూ ఆనందంగా జీవిస్తున్నారు. బీఆర్‌ఎస్ పాలనలో పరిస్థితి ఇలా ఉంటే.. కాంగ్రెస్ నేతలు మాత్రం వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతుందంటున్నారు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే మూడు గంటల్లో మూడెకరాలు పారుతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. మరోవైపు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాల్సి వస్తే భూములన్నీ బీళ్లుగా మారడం ఖాయమని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం రైతులు తమ బోరు బావులకు వినియోగిస్తున్న 5 హెచ్‌పీ మోటర్లకు బదులుగా 10 హెచ్‌పీ మోటర్లను వాడితే రైతులు, ప్రభుత్వంపై రెట్టింపు భారం పడనున్నది. రైతులు 5 హెచ్‌పీ మోటర్లను కొనుగోలు చేయాలంటేనే అనేక ఇబ్బందులు పడతారు. అలాంటిది ఏకంగా 10 హెచ్‌పీ మోటర్లను కొనుగోలు చేయాలంటే రూ.80 వేల నుంచి రూ. ఒక లక్ష వరకు అధనపు భారం పడనుంది. ఈ క్రమంలో కరెంటు లోడ్‌ను నియంత్రించేందుకు ఎక్కడికక్కడ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని కూడా పెంచాల్సి ఉంటుంది. ఇప్పుడున్న ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యంతో 10 హెచ్‌పీ మోటర్లను నడిపిస్తే అవి కాలిపోయే పరిస్థితి నెలకొంటుంది. దీంతో రైతులు మళ్లీ పాత రోజుల మాదిరిగా కాలిపోయిన మోటర్లను బాగు చేయించేందుకు సమీప పట్టణాల్లోని మోటర్ వైండింగ్ దుకాణాలకు పరుగులు పెట్టాల్సి వస్తుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పంటలకు నీరందక, మోటర్లను బాగు చేయించలేక బతుకులు ఆగమయ్యే పరిస్థితులు పునరావృతం అయ్యే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

10 హెచ్‌పీ మోటర్లతో అడుగంటనున్న భూగర్భ జలాలు

నిర్మల్ జిల్లా పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఇక్కడి రైతులు బోరుబావుల కింద రెండు సీజన్లతో వరి వేస్తుంటారు. నీటి నిల్వలను బట్టి 3, 5 హెచ్‌పీ మోటర్లను వినియోగిస్తారు. రేవంత్‌రెడ్డి చెప్పినట్లు 10 హెచ్‌పీ మోటర్లు వినియోగిస్తే బోర్లలోని నీటి నిల్వలు తగ్గిపోయి, భూగర్భ జలాలు అడుగంటి పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బోర్లకు 5 హెచ్‌పీ మోటర్లే సరిపోతాయని అధికారులు చెబుతున్నారు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉండేది. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్‌కు అవకాశమిస్తే కరెంటు కష్టాలతోపాటు రైతు ఆత్మహత్యలు తప్పవని జిల్లా రైతాంగం పేర్కొంటున్నది. వ్యవసాయంపై ఎలాంటి అవగాహన లేకుండా 3 గంటల కరెంటు చాలు, 10 హెచ్‌పీ మోటార్లు పెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై జిల్లా రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఇప్పుడు రెండు పంటలకు సరఫరా అవుతున్న నీరు.. రేపు 10 హెచ్‌పీ మోటర్లు పెడితే ఒక్క పంటకు కూడా సరిపోదని పేర్కొంటున్నారు. బోర్లలోని నీటిని రెండు రోజుల్లో తోడేస్తే ఆరు నెలల దాకా పంటలను ఎలా కాపాడుకునేదని ప్రశ్నిస్తున్నారు. రేవంత్‌రెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడి రైతుల జీవితాలతో ఆడుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరంతరాయంగా ఉచిత కరెంట్ ఇచ్చి బీడు భూములను సాగులోకి తెచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే తమ మద్దతు ఉంటుందని రైతులు స్పష్టం చేస్తున్నారు.

❖ 10 హెచ్‌పీ మోటర్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు ఆగవు

దండేపల్లి, నవంబర్ 21 : కాంగ్రెసోళ్లు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటున్నరు. గట్లయితే ట్రాన్స్‌ఫార్మర్లు పోవా. మళ్లీ పాత పద్ధతే వస్తది. సాధారణ రైతు 10హెచ్‌పీ మోటరు కొనే పరిస్థితి ఉండదు. సుమారు రూ. లక్షకు పైగా ఖర్చు అవుతుంది. 10 హెచ్‌పీ మోటర్ బావిలో పెడితే కనీసం గంట కూడా నడువదు. ఎంత పెద్ద బావి అయినా సరే గంట లోపే మొత్తం నీళ్లు ఎత్తిపోస్తది. రైతులు ఎప్పటి నుంచో 3-5 హెచ్‌పీ మోటర్లు పెట్టి ఎవుసం చేస్తున్నరు. బావుల్లో నీరు ఉండక చిన్న మోటర్లే కాలిపోయేవి. అప్పుడు అంత నాణ్యత లేని కరెంటు ఉండేది. ఎప్పుడు కరెంటు వస్తుందో ఎవరికి తెలియపోతుండే. కరెంటు రాగానే రైతులు మొత్తం ఒకేసారి మోటర్లు వేయడంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవి. వాటిని రైతులే తీసుకుని పోయి రోజుల తరబడి కాపుకాస్తు మరమ్మతులు చేయించుకునే పరిస్థితి ఉండేది. తెలంగాణ వచ్చిన తర్వాత 24 గంటల కరెంటుతో రైతులు రంది లేకుంట ఎవుసం చేసుకుంటున్నరు.

- ఉప్పు రామన్న, మోటరు వైండర్, తాళ్లపేట

❖ మూడు గంటల కరెంట్‌తో నష్టమే

కాసిపేట, నవంబర్ 21 : మూడు గంటల కరెంట్‌తో పొలాలకు నష్టమే. 24 గంటల కరెంట్‌తోనే రైతులకు మేలు. కాంగ్రెస్ వాళ్లు చెప్పున్న 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే సక్కగా నడువవు. కాలిపోతయి. మస్తు తిప్పలైతది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంట్‌తోనే వ్యవసాయం మంచిగుంది. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవడం సాధ్యమైన పనేనా, మూడు గంటలతో ఎవుసం ఎట్లా చేసుడో రేవంత్‌రెడ్డి చెప్పాలి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల విద్యుత్‌తోనే పంటలు మంచిగా పండుతున్నయి.

- రాజాగౌడ్, రైతు, కాసిపేట

❖ కాంగ్రెసోళ్లకు కష్టాలు తెలియవు

చెన్నూర్ రూరల్, నవంబర్ 21 : 2014 ముందున్న పరిస్థితి అందరికీ తెలిసిందే. గతంలో ఏ అర్ధ రాత్రో.. అప రాత్రో కరెంట్ రెండు మూడు గంటలు వచ్చి పోయేది. రైతులంతా పొలాల్లో పడి గాపులు కాసేవారు. అక్కడే పడుకొని పంటలను తడుపుకునే దుస్థితి ఉండేది. పాములు, తేళ్లు కుట్టి చనిపోయినోళ్లు కూడా ఉన్నరు. 3 గంటలు ఇచ్చే కరెంట్ రైతులకు ఏమాత్రం సరిపోదు. ఇప్పుడున్న పద్ధతే కావాలి. నాడు కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం 24 గంటల కరెంట్ ఇస్తున్నరు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యుత్ సమస్యలు పరిష్కారమైనయి. రైతులకు ప్రాధాన్యత పెరిగింది. కాంగ్రెసోళ్లకు కష్టాలు తెలియవు. అధికారంలోకి రావడం కోసం సాధ్యంకాని హామీలిస్తున్నరు. రైతులెవ్వరూ నమ్మే స్థితిలో లేరు.

- గట్టు సంపత్ గౌడ్, రైతు, కొమ్మెర

❖ కాంగ్రెసోళ్లను నమ్మితే అంతే

నెన్నెల, నవంబర్21 : రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని కాంగ్రెసోళ్లు అంటున్నరు. అట్లయితే రైతులపై తీవ్ర భారం పడుతుంది. మోటర్‌కు రూ. లక్షకు పైగా అయితయి. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలిపోయే ప్రమాదముంది. కాలిపోయిన మోటర్‌ను రిపేరు చేయించాలంటే దాదాపు రూ. 10 వేలకు పైగా ఖర్చు అవుతుంది. రిపేరు నుంచి వచ్చే వరకు పొలం ఎండి పోతది. అన్నితీర్ల నష్టమే ఉంటది. ఇప్పుడు సీఎం కేసీఆర్ ఇచ్చే 24 గంటలు కరెంటుతో రంది లేకుంట రెండు పంటలు పండించుకుంటున్నం. కాంగ్రెసోళ్లను నమ్మితే బతుకులు అంతే.. అందుకే మేమంతా మళ్లోసారి బీఆర్‌ఎస్ వైపే ఉంటం.

- దుర్గం మధనయ్య, నెన్నెల

❖ మూడుగంటల కరెంటుతో నిద్రలేని రాత్రులే

హాజీపూర్, నవంబర్ 21 : కాంగ్రెస్ పార్టీ వ్యవసాయానికి 3 గంటల కరెంటే చాలంటున్నది. అట్లయితే రైతులకు మళ్లా నిద్రలేని రాత్రులే ఇగ. పొలాల కాడనే పడుకోవాల్సిన పరిస్థితి వస్తది. యేటా ఒకే పంట తీయవచ్చు. వాళ్ల పాలనలో నరకం చూసినం. మళ్లా కుట్రలు చేస్తున్నరు. ఇప్పుడున్న 24 గంటల కరెంట్ మాకెంతో మేలు చేస్తున్నది. రంది లేకుంట యేటా రెండు పంటలు తీస్తున్నం. కాంగ్రెసోళ్లకు అధికారమిస్తే మళ్లా మా బతుకులు ఆగమే అయితయి. **- బోర్లకుంట శంకరయ్య, దొనబండ**

❖ లోడ్‌పడి ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలిపోతయ్

హాజీపూర్, నవంబర్ 21 : మా ఊరి శివారులో నాకు నాలుగెకరాల భూమి ఉంది. కాంగ్రెస్ పార్టీ 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్నది. ఆ మోటరు పెట్టాలంటే రూ. లక్ష దాకా ఖర్చు అవుతుంది. కరెంటు బిల్లు కూడా ఎక్కువ వస్తది. లోడ్‌పడి ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలిపోతయి. సన్న, చిన్నకారు రైతులు అప్పుల పాలవ్వడం ఖాయం. ఓట్ల కోసం తప్పుడు ప్రచారాలు మానుకోవాలి. వ్యవసాయం మీద అవగాహన లేనోల్లు గట్లనే మాట్లాడుతరు. **- రామటెంకి రాజగోపాల్, టీకన్నపల్లి**

ధరణి పోతే అరిగోసే

'హస్తం' నేతల ప్రకటనపై అన్నదాతల్లో ఆందోళన

- కౌలుదారు కాలంతో తిప్పలు తప్పవంటూ ఆగ్రహం
- మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థకు బీజం పడుతుందని మండిపాటు
- ఆఫీసులు, కోర్టుల చుట్టూ తిరిగే దుస్థితి వస్తుందని ఆవేదన
- కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట ముంచుడు ఖాయమంటున్న భూమి పుత్రులు

మంచిర్యాల, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : స్వయంగా రైతుబిడ్డ అయిన సీఎం కేసీఆర్.. ముందు చూపుతో భూములకు రక్షణ కల్పించేందుకు ధరణిని తీసుకొచ్చారు. ఈ పోర్టల్ వల్ల భూ సమస్యలు పరిష్కారమవుతున్నాయి. అదే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రోజుల్లో రెవెన్యూ శాఖలో తహసీల్దార్ మొదలుకొని.. కింది స్థాయిలోని వీఆర్వోల వరకు డబ్బులు ఇవ్వందే పని జరిగేది కాదు. పటేల్, పట్వారీ వ్యవస్థ, ఆ తర్వాత వచ్చిన రెవెన్యూ వ్యవస్థ.. ఇలా ఏదైనా సరే రైతులను ఏడిపించినయ్. అధికారులు రాత్రికి రాత్రే పట్టాదారుల పేర్లు మార్చి రైతుల బతుకులను ఆగం చేసేటోళ్లు. రాత పద్ధతిలో ఉన్న రికార్డుల్లో.. పహణీల్లో ఇష్టం వచ్చినట్లు మార్పులు, చేర్పులు చేసేటోళ్లు. పెన్ను పట్టి రాసిందే భూమి.. గీసిందే హద్దు.. రైతులకు తమ పేరు మీద ఉన్న భూమి వేరేటోళ్ల పేరుకు మారిందన్న ముచ్చటే తెలిసేది కాదు. అక్కరకో, ఆడబిడ్డ పెండ్లికో, కొడుకు చదువుకో భూమి అమ్ముకుందామని చూసే సరికి వాళ్ల పేరు మీద భూమి ఉండేది కాదు. అప్పుడు మొదలయ్యేది అసలు కథ.. ఎవుసం పక్కన పెట్టి రెవెన్యూ ఆఫీసుల చుట్టూ, వీఆర్వోల చుట్టూ తిరుగుడే సరిపోయేది. భూమి కోసం పైరవీలు కొట్లాటలు, గొడవలు, పోలీస్ స్టేషన్ పంచాయతీలు ఇవేవి తెగకపోతే కోర్టు దాకా పోక తప్పేది కాదు. కోర్టుకు పోయిన ముచ్చట ఎంతకూ తెగక అరిగోస పడాల్సి వచ్చేది. ఈ పంచాయితీలన్నీ పహణీలో ఉన్న 31 కాలమ్స్‌తో మొదలయ్యేది. ముందుగా పహణీలో ఉన్న అనుభవదారుకాలంలో భూమి యాజమానిగా ఉన్న రైతు కాకుండా మరొకరి (కబ్జా దారు) పేరు ఎక్కించేటోళ్లు. అది జరిగిన ఏడాదిలోగా రైతు పహణీ చెక్ చేసుకోలేదా.. వచ్చే ఏడాదికి అనుభవదారు పట్టాదారు అయ్యేటోడు. అసలు పట్టాదారు రోడ్డున పడేటోడు. ఇప్పుడు కాంగ్రెస్ గిదే పనే చేస్తనని చెప్పుకొని ఓట్లు అడుగుతుంది. అనుభవదారు(కౌలు)దారు కాలమ్ తీసుకువచ్చి రైతులను మళ్లోసారి మోసం చేయాలని చూస్తున్నది. భూమిని అమ్ముకోవాలన్నా, కొనుగోలు చేయాలన్నా.. రైతు వచ్చి వేలిముద్ర పెడితేగానీ సాధ్యం గానీ డిజిటల్ వ్యవస్థ ధరణిని రద్దు చేస్తామంటున్నది. ధరణిని తీసేసి మళ్లీ రాత పుస్తకాలు తెచ్చి, వీఆర్వోలను పెట్టి, కౌలుదారు కాలమ్ తీసుకువచ్చి.. లంచం ఇస్తే చాలు హక్కు దారుల పేర్లను మార్చే వ్యవస్థను తీసుకురావాలని కుట్రలు పన్నుతున్నది. పదేళ్ల కిందట తెలంగాణలో ఎలాంటి పరిస్థితి ఉండెనో.. గదే మళ్లీ తీసుకురావాలని చూస్తున్న కాంగ్రెస్‌కు పొరపాటున ఓటేసినా.. నట్టేట ముంచుడు ఖాయమని రైతులు భయపడిపోతున్నరు.

❖ ధరణి తీసేస్తే రైతులకు కష్టాలు తప్పవు

తాండూర్, నవంబర్ 20 : రైతుల భూములు తారుమారు కాకుండా, రికార్డుల్లో అవకతవకలు జరుగకుండా, రైతులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకొచ్చింది. దానిని రద్దు చేస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పడం సరి కాదు. ధరణి రద్దు చేయడం వల్ల రైతాంగం ఎన్నో ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. మళ్లీ పాత రికార్డులు ఉంటే బడాబాబులు అవకతవకలకు పాల్పడే అవకాశం ఉన్నది. తెలంగాణ రైతులు ప్రస్తుత ప్రభుత్వంలో ఎంతో సంతోషంగా ఉన్నారు.

- గోకర్ణం జయచందర్, తాండూర్

❖ ధరణి లేనప్పుడు వీఆర్వోలే రాజ్యం ఏలిండ్రు..

లక్షెట్టిపేట, నవంబర్ 21: కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు ఉన్న సమయంలో ధరణి లేకపోవడంతో వీఆర్వోలే రాజ్యం ఏలిండ్రు. పట్వారీకి లంచం ఇవ్వనిదే పహణీ కూడా ఇయ్యకపోతుండే. భూములకు సంబంధించి ఏది కావాలన్నా తహసీల్ ఆఫీస్, పట్వారీ ఇంటి చుట్టూ తిరిగేటోళ్లం. కూలీ పనులు మానేసి ఆఫీసుల చుట్టూ తిరిగేవాళ్లం. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ పుణ్యమా అని ధరణి తీసుకొచ్చిండు. పట్వారీల వ్యవస్థ లేకుండా చేసిండు. పట్వారీల బలుపులు చూసి వాళ్ల వ్యవస్థను రద్దు చేసిండు సీఎం కేసీఆర్. అంత మంచి ధరణి సాఫ్ట్‌వేర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మళ్లీ తీసేసి కొత్త సాఫ్ట్‌వేర్ పెడతామని అంటుండ్రు. పట్టాదారు కాలం కౌలుదారు కాలం పెట్టి భూములను రైతులను నట్టేట ముంచుదామనే కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆలోచన ఉన్నట్లున్నది. రైతులు భయంతో ఎవరికీ కౌలుకు ఇవ్వడానికి ముందుకు రాడు. భూమి రిజిస్ట్రేషన్, జమాబంది చేసి సాయంత్రం వరకు పట్టాదారు పాసు పుస్తకం కూడా చేతికి ఇస్తుండ్రు. **- మదిరె నర్సింగ్, బలరావుపేట గ్రామం, లక్షెట్టిపేట మండలం**

❖ భూమాత వస్తే చిక్కులే..

చెన్నూర్ రూరల్, నవంబర్ 21: ధరణి పోర్టల్ రైతులకు మేలు చేసేలా ఉంది. క్రయ, విక్రయదారులు ఇబ్బందుల్లేకుండా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నరు. అవినీతికి తావులేకుండా ప్రక్రియ పారదర్శకంగా సాగుతున్నది. కాంగ్రెసోళ్లు భూమాత పోర్టల్ తీసుకొస్తరట. రకరకాల కాలమ్స్ పెడతరట. గాళ్లను నమ్మితే మళ్లా చిక్కులు తప్పవు. భూ రికార్డులకు భద్రత లేకుండా పోతుంది. మళ్లీ రెవన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తది. మళ్లా గొడవలు మొదలైతయి. అవగాహన లేకుండా కాంగ్రెస్ నేతలు పిచ్చిగా మాట్లాడుతున్నరు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. **- సుందిళ్ల రాజయ్య, ఎర్రగుంటపల్లి, రైతు**

❖ ధరణి పోతే అవస్థలే..

రామకృష్ణాపూర్, నవంబర్ 20 : కాంగ్రెసోళ్లు ధరణి పోర్టల్ రద్దు చేస్తమంటున్నరు. ధరణి పోతే ఎవరి భూమి ఎంతుందో తెల్వకుంట పోతది. మళ్లా పాత పద్ధతే వస్తది. పట్వారీ వ్యవస్థతో అవస్థలు పడ్డం. అంతా అవినీతి రాజ్యమేలుతది. లంచంలేనిదే ఏ పనీ జరుగదు. ఒకరి భూములు ఇంకొకరికి రాస్తరు. రైతులు మళ్లా ఇబ్బంది పడ్తరు. రైతుబంధు కూడా రాకుంటైతది. రైతులు భూమి కొన్నా.. అమ్మినా మూడో వ్యక్తి ప్రమేయంతో రిజిస్ట్రేషన్లు అయితయి. ధరణి ఉంటే దొంగ పట్టాలకు ఆస్కారముండదు. వేలిముద్రలు వేస్తేనే భూమి పట్టాలు అవుతాయి. **- దుర్గం శంకర్, కొత్త తిమ్మాపూర్**